శ్రీరాముడి కల్యాణానికి విరాళం



కీసర: అహ్మద్‌గూడలోని దాసాంజనేయస్వామి దేవాలయం వద్ద ఈనెల 6న నిర్వహించే శ్రీరాముడి కల్యాణోత్సవానికి బండ్లగూడకు చెందిన ఠాకూర్ భవానిసింగ్ రూ. 25 వేలను విరాళంగా అందజేశారు. మాజీసర్పంచ్ గండి యాదగిరిగౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఉట్కూర్ నరసింహ్మగౌడ్, ఎక్స్ వార్డుసభ్యులు సంతోష్‌గౌడ్, గోవిందసింగ్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్యకు నివాళి



సాక్షి, సిటీ బ్యూరో: మేడ్చల్ కలెక్టరేట్‌లో తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి ఝాన్సీరాణి, వివిధ బీసీ సామాజిక వర్గాలకు చెందిన జిల్లా ప్రతినిధులు చీర మల్లేష్ కుర్మ, గూడె ఎల్లయ్య, చీర వినోద, మల్యాల మహేష్, ముజాహిద్, రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

తూంకుంట కమిషనర్‌కు అచీవర్ అవార్డు



అవార్డును అందుకుంటున్న కమిషనర్ వెంకటగోపాల్

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్‌కు అచీవర్ అవార్డు దక్కింది. గురువారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ అభివృద్ధి సంస్థలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కమిషనర్‌ల సమావేశం నిర్వహించారు. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో 2023-24, 2024-25 సంవత్సరాలకు 85 శాతం ఇంటి పన్నులను వసూలు చేసి అచీవర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డా.శ్రీదేవి చేతుల మీదుగా కమిషనర్ అందుకున్నారు.

వ్యక్తి అదృశ్యం



కిరణ్

జవహర్‌నగర్: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్ చంద్రపురికాలనీలో నివసించే అలుకార్ కిరణ్ (32) పేయింటింగ్ పనిచేస్తుంటాడు. భార్య సుధారాణి, కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నారు. గత మార్చినెల 31న కిరణ్ ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్కు కబ్జాకు యత్నం !

- గోడలకు సున్నం వేసి ఆటవస్తువులను కత్తిరించి..
- పార్కులోకి అర్ధరాత్రి గుర్తుతెలియని దుండుగల ప్రవేశం



నందనవనం పార్కులో ఆటవస్తువులను కత్తిరించిన దుండగులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 15వ డివిజన్‌లోని నందనవనం పార్కులో బుధవారం అర్ధరాత్రి కొందరు గుర్తు తెలియని దుండగులు వచ్చి పార్కులో చిన్నారులు ఆడుకునే వస్తువులను మిషన్‌తో కత్తిరించి, గోడలకు సున్నం వేసి కబ్జా చేసేందుకు యత్నించారు. నందనవనం పార్కును కబ్జా చేయడానికి వచ్చిన వారిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

మేడిపల్లి: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి అన్నారు. గురువారం మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆయన సత్ప్రవర్తనపై అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో క్రిమినల్, సివిల్ వివాదాల్లో వెళ్లొద్దని సూచించారు. మళ్లీ ఇలాంటి నేరాల్లో పాలుపంచుకుంటే కఠిన చర్యలతో పాటు పీడీ యాక్టును సైతం నమోదు చేస్తామని హెచ్చరించారు.

సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు



ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో నివాళులర్పించిన కురుమ సంఘం నాయకులు

మేడ్చల్ జోన్ పరిధిలో తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఆయన చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన కీలకపాత్ర పోషించారని, ఆయన పోరాట స్ఫూర్తిని పలువురు నేతలు కొనియాడారు.

– మేడ్చల్ జోన్ బృందం.



మేడ్చల్ పట్టణంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



నాగారంలో..



జవహర్‌నగర్‌లో..

సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాలి



నిరసన చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

పోచారం: కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చెందిన భూములను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం కార్యకర్తలు అన్నోజిగూడలోని రాజీవ్‌గృహకల్ప కాలనీలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం సీపీఎం మండల కార్యదర్శి ఎన్.సబిత మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాల భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టే విధానాలకు ప్రభుత్వం స్వస్తి చెప్పి, సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాలని కోరారు. లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సీపీఎం నాయకురాలు అరుణ, సునీతాదేవి, అనసూయ, భారతమ్మ, సుజాత, శాంతి తదితరులున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని రాఘవేంద్రనగర్, బాలాజీనగర్ కాలనీల మీదుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు మేడ్చల్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. శామీర్‌పేట్ వైపు వెళ్లే బస్సులను బాలాజీనగర్, కేఎల్‌ఆర్ నగర్, రాఘవేంద్రనగర్ మీదుగా నడిపితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సానుకూలంగా స్పందించిన డీఎం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సత్యపాల్‌రెడ్డి, మురళి, మహిపాల్‌రెడ్డి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు

మేడ్చల్‌రూరల్: అజ్మీర్ షరీఫ్ దర్గాలో గిలాఫ్ సమర్పించేందుకు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖ్వాజా గరీబ్ నవాజ్ హజ్రత్ మొయినుద్దీన్ చిస్తీ రహమతుల్లా అలైహి అజ్మీర్ షరీఫ్ దర్గాలో సమర్పించేందుకు అలంకరించిన (గిలాఫ్) వస్త్రాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రార్థనల అనంతరం మేడ్చల్ మాజీ కో– ఆప్షన్ సభ్యులు మహబూబ్ అలీకి అందజేశారు. మేడ్చల్ మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, మైనార్టీ అధ్యక్షుడు అబీద్, ముస్లిం నాయకులు లల్లూ, యూసఫ్, నసీర్, తాజ్, అజార్ తదితరులున్నారు.



చలివేంద్రం ప్రారంభం

శామీర్‌పేట్: బాటసారుల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషదాయకమని మాజీ సర్పంచ్ జామ్ రవి అన్నారు. గురువారం మండల కేంద్రం మూడుచింతలపల్లిలో అదే గ్రామానికి చెందిన మధురెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. బాల్‌రాజ్, మాజీ డిప్యూటీ సర్పంచ్ వెంకటరమణారెడ్డి, మాజీ కో– ఆప్షన్ మెంబర్ నరసింహ, నాయకులు నర్సింహులు, సత్యనారాయణ తదితరులున్నారు


రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



యాదిరెడ్డి (ఫైల్)

ఘట్‌కేసర్: పొలం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ద్విచక్రవాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం.. అవుషాపూర్ గ్రామానికి చెందిన జిల్లెల యాదిరెడ్డి (81) గురువారం ఉదయం వ్యవసాయ పొలానికి వెళ్లాడు. కాగా పనులు ముగించుకుని ఇంటికి వెళ్లాలని వీబీఐటీ కళాశాల నుంచి జాతీయరహదారి వైపు వస్తుండగా ఓ మోటారు సైకిల్ వేగంగా వచ్చి అతడిని ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై హర్షం



మాట్లాడుతున్న బిక్కునాథ్ నాయక్

పోచారం: వక్ఫ్ బోర్డు బిల్లును బీజేపీ సవరణ చేయడం హర్షణీయమని బీజేపీ ఎస్టీ మోర్చా జాతీయ కార్యవర్గసభ్యుడు నానావత్ బిక్కునాథ్‌నాయక్ అన్నారు. గురువారం అన్నోజిగూడలో ఆయన మాట్లాడుతూ.. వక్ఫ్ బిల్లులో సెక్షన్ 40 ప్రకారం దేశంలో ఏ మతానికి చెందిన భూమినైనా వక్ఫ్‌బోర్డు ప్రతినిధులు తమదేనని చెబితే అది వారికే చెందుతుందని, అందుకే ఇలాంటి చట్టాలకు సవరణ అవసరమన్నారు. ప్రపంచంలో 57 ముస్లిం దేశాలున్నా.. ఎక్కడా వక్ఫ్‌బోర్డు లేదని స్పష్టం చేశారు. బీజేపీ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు నానావత్ సురేష్‌నాయక్, సీనియర్ నాయకుడు తావుర్యానాయక్ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి స్పందన

- మేడ్చల్ జిల్లాలో 15,497 దరఖాస్తులు
- అవగాహన కల్పిస్తున్న జిల్లా బీసీ అభివృద్ధి శాఖ



సాక్షి, సిటీబ్యూరో: బీసీ అభివృద్ధిశాఖ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 'రాజీవ్ యువ వికాసం' పథకంపై చేపట్టిన అవగాహన కార్యక్రమాలతో జిల్లాలో ఈ పథకానికి ఇప్పటి వరకు 15,497 మంది నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకున్నారు .

ఈనెల 14వ తేదీ వరకు అవకాశం..

రాజీవ్ యువ వికాసం పథకానికి 21–55 ఏళ్ల (01 జూలై 2025 నాటికి) ఉన్న అభ్యర్థులు ఈనెల 14 వరకు దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం ఉందని బీసీ అభివృద్ధిశాఖ జిల్లా అధికారి ఝాన్సీ రాణి చెప్పారు. 21 నుంచి 60 ఏళ్లున్న అభ్యర్థులు భూసంబంధ, ఉద్యాన, వ్యవసాయ పరికరాల పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకునే అభ్యర్థి ఏడాది ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ/ మున్సిపాలిటీ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు మాత్రమే ఉండాల్సి ఉంటుంది.

దరఖాస్తుదారులు సూచించిన ధ్రువీకరణ పత్రాలను జతపరచాల్సి ఉంటుంది. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు లేదా ఆదాయ ధ్రువపత్రం, కుల ధ్రువీకరణపత్రం (తెలంగాణ ఏర్పడిన తర్వాత జారీ చేసినది మాత్రమే), డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగం వారికి మాత్రమే), పట్టాదార్ పాస్‌బుక్ (వ్యవసాయరంగం వారికి మాత్రమే), సదరం సర్టిఫికెట్ (దివ్యాంగులకు మాత్రమే) ప్రతులతో సహా పాస్‌పోర్టు సైజు ఫోటోను దరఖాస్తుతో జతపరచాల్సి ఉంటుంది.

'మీ సేవ' నుంచి జారీ చేసినవి మాత్రమే..

మీ–సేవ నుంచి జారీ చేసిన ధ్రువపత్రాలు మాత్రమే అంగీకరించబడతాయని బీసీ అభివృద్ధి శాఖ స్పష్టం చేస్తోంది. మరిన్ని వివరాలకు కలెక్టరేట్‌లోని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఆ శాఖ వర్గాలు కోరుతున్నాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా బీసీ అభివృద్ధిశాఖ ప్రకటించింది.

భారతి అల్ట్రాఫాస్ట్ మెరుగైన సిమెంట్



తాపీ మేస్త్రీలకు అవగాహన కల్పిస్తున్న టెక్నికల్ ఇంజనీర్ బద్రి

బోడుప్పల్: నిర్మాణ రంగంలో భారతి సిమెంట్ మెరుగైందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ బద్రి అన్నారు. బోడుప్పల్‌లో అంజనపురి కాలనీలోని శ్రీలక్ష్మీగణపతి ఏజెన్సీలో సాయంత్రం తాపీ మేస్త్రీలతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ మెరుగైనదని పేర్కొన్నారు. నిర్మాణ రంగంలో రారాజుగా భారతి సిమెంట్‌ను వాడాలని కోరారు. ఈకార్యక్రమంలో డీలర్ రవి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

విలేకరిని దూషించిన వ్యక్తిపై కేసు

ఉప్పల్: ఓ దినపత్రిక విలేకరిని దూషించిన వ్యక్తిపై బుధవారం ఉప్పల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ విలేకరి జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన ఆర్టీఐ కాపీని తీసుకెళ్లేందుకు వెళ్లాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన స్థానికుడు మధుసూదన్‌రెడ్డి వచ్చి 'ఆర్టీఐ ఎందుకు అడుగుతున్నావ్ అంటూ' దూషిస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో సదరు విలేకరి ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్



శామీర్‌పేట రేషన్ దుకాణంలో స్కానర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

శామీర్‌పేట్: లబ్ధిదారులు సన్నబియ్యం పంపిణీని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు అన్నారు. గురువారం తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేటలోని రేషన్ దుకాణాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సన్నబియ్యం పంపిణీ ప్రక్రియను పౌరసరఫరాల శాఖ అధికారి (డీఎస్‌ఓ) సుగుణబాయ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారుల వివరాలను రిజిస్టార్‌లలో నమోదు చేయాలని డీలర్‌కు సూచించారు. బియ్యం పంపిణీ నిర్వహిస్తున్న ఫింగర్ ప్రింట్ స్కానర్‌తో పాటు తూకాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పథకాన్ని ప్రతి లబ్ధిదారుడికి అందేలా చూడాలని, ప్రతి లబ్ధిదారుడు ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం పంపిణీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సంయుక్త, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులున్నారు.

రేషన్ దుకాణంలో ఆకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



చీర్యాలలో బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి అత్వెల్లిలోని రేషన్‌దుకాణాన్ని అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం పంపిణీ తీరును ఆయన పరిశీలించారు. సన్నబియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న తీరును తెలుసుకున్న ఆయన ఎలాంటి అవకతవకలు జరగకుండా పంపిణీ చేయాలని డీలర్‌కు సూచించారు. రేషన్ లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చీర్యాలలో రేషన్ దుకాణం సందర్శన..

కీసర: ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందజేస్తున్న సన్నబియ్యం పంపిణీ పారదర్శకంగా ఉండాలని, రేషన్‌కార్డుదారులందరికీ సన్నబియ్యం పంపిణీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. గురువారం చీర్యాలలోని రేషన్ దుకాణాన్ని ఆమె జిల్లా సవిల్ సప్లై అధికారితో కలిసి తనిఖీ చేశారు. రేషన్ దుకాణం ద్వారా పేదలకు అందజేస్తున్న సన్నబియ్యం నాణ్యతను పరిశీలించారు. పేదలకు ప్రభుత్వం అందజేస్తున్న సన్న బియ్యం పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నైపుణ్యాలు వెలికితీసేందుకు 'టెక్నికల్ ఫెస్ట్'లు దోహదం



ప్రారంభోత్సవంలో శ్రీకాంత్, కళాశాల డైరెక్టర్ వీపీ నారాయణ తదితరులు

మేడ్చల్‌రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాల వెలికితీసేందుకు టెక్నికల్ ఫెస్ట్‌లో దోహదపడుతాయని క్లౌడ్ కంప్యూటింగ్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. గురువారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ సెట్‌లో 'అజూరా 2కే 2025' పేరుతో టెక్నికల్, నాన్ టెక్నికల్ ఈవెంట్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో రాణించాలంటే ఒక్క చదువుకే పరిమితం కాకుండా ఇతర అంశాల్లోనూ ప్రతిభ కనబరచాలన్నారు. నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలన్నారు. కళాశాలల్లో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం వల్ల విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. పోటీతత్వం, సహకారం భావం అలవడుతుందన్నారు. టెక్నికల్ ఈవెంట్లలో 300 మంది విద్యార్థులు పోస్టర్ ప్రెజెంటేషన్, పేపర్ ప్రజెంటేషన్ ఇవ్వడంతో పాటు సాంకేతిక ప్రదర్శనలు ప్రదర్శించారు. నాన్‌టెక్నికల్‌లో 2500 మంది విద్యార్థుల పాల్గొన్నారు. సీఎంఆర్ చైర్మన్‌గోపాల్‌రెడ్డి, యాజమాన్య కమిటీ సభ్యుడు అభినవ్‌రెడ్డి, డైరెక్టర్ వీపీ నారాయణ, ప్రిన్సిపాల్ శేషుకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమానికి కన్వీనర్‌గా డాక్టర్ నాగరాజునాయక్, కో– కన్వీనర్‌గా భాస్కర్ వ్యవహరించారు.

శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ పరుశురాం

ఘట్‌కేసర్: శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 6న నిర్వహించే శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఇన్‌స్పెక్టర్ పరుశురాం అన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శ్రీరామనవమి ఉత్సవ నిర్వాహకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. సీతారాముల కల్యాణం, అన్నదానం, ఊరేగింపును ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఎస్సైలు నరసింహ, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ..

మరో రెండు ఇళ్లల్లో చోరీకి యత్నం



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఘట్‌కేసర్: గుర్తు తెలియని దుండగులు తాళం వేసిన ఇంట్లో చొరబడి వెండి వస్తువులను ఎత్తుకెళ్లిన ఘటన గురువారం తెలవారు జామున ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరుశురాం, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌ఎఫ్‌సీనగర్ సీ–1 కాలనీలో ఉండే మన్మోహన్ అపొలో జంక్షన్ వద్ద ఉద్యోగం చేస్తూ.. అక్కడే నివాసం ఉంటున్నాడు. కాగా గురువారం ఉదయం ఇంటితాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులు, మన్మోహన్‌కు సమాచారం అందించారు. బాధితుడు ఇంటికి చేరుకుని పరిశీలించగా పూజగదిలో 10 తులాల వెండి సామగ్రి కనిపించలేదు. క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై శ్రీకాంత్ క్లూస్ టీమ్ సాయంతో ఫింగర్ ప్రింట్స్, ఇతర ఆధారాలను సేకరించారు. మరో రెండు ఇళ్లల్లో తాళం పగులగొట్టి చోరీకి యత్నించినట్లు స్థానికులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

24 గంటల్లో తల్లిదండ్రుల చెంతకు..

- అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యం
- హన్మకొండలో బంధువుల ఇంటికి వెళ్లిన బాలిక
- సఖి సెంటర్‌కు అప్పగించిన పోలీసులు



బాలికను అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ పరుశురాం, ఎస్సై నరసింహ

ఘట్‌కేసర్: అదృశ్యమైన ఓ బాలిక ఆచూకీ లభించింది. పట్టణంలో బుధవారం గణశ్రీ (10) మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించి 24 గంటల్లోగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి హనుమాన్‌వాడకు చెందిన గుంజ స్రవంతి, రాజశేఖర్ దంపతుల కుమార్తె గణశ్రీ కుమారుడితో ఘట్‌కేసర్ డీపీఎస్ స్కూల్ ఎదురుగా నివాసం ఉంటోంది. తల్లి ఇళ్లల్లో పని ముగించుకుని ఇంటికి వచ్చేసరికి కుమార్తె కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. రంగంలోకి దిగిన పోలీసులు బాలిక ఆచూకీ కోసం బృందాలుగా ఏర్పడి వెతికారు. ఆడుకోవడానికి ఎవరూ లేకపోవడంతో గతంలో నివాసం ఉంటున్న హన్మకొండకు ఆర్టీసీ బస్సులో వెళ్లింది. వెంటనే ఎస్సై నరసింహ ఆధ్వర్యంలో పోలీసుల బృందం హన్మకొండకు చేరుకుని బాలికను ఘట్‌కేసర్‌కు తీసుకొచ్చి గురువారం తల్లిదండ్రులకు అప్పగించారు. విచారణలో బాలిక చదువుకోవడానికి ఆసక్తి ఉందని తెలిపింది. దీంతో పోలీసులు తల్లిదండ్రుల అనుమతితో అల్వాల్‌లోని సీడబ్ల్యూ (చైల్డ్ వెల్ఫేర్ కమిటీ) సఖి సెంటర్ సిబ్బందికి అప్పగించారు. 24 గంటల్లోగా బాలిక ఆచూకీ కనిపెట్టిన ఘట్‌కేసర్ పోలీసులు, రాచకొండ ఐటీసెల్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.